

శ్రీరామనవమి వేడుకల్లో సీతారాముల వేషధారణలో చిన్నారులు

శ్రీరామనవమి వేడుకల్లో అలరించిన చిన్నారులు

ఎర్రగడ్డ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో మంగళవారం శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా చిన్నారులు సీత, రాముడు, లక్ష్మణుడు, ఆంజనేయుడి వేషధారణల్లో అలంకరించారు. చిన్నారులు భక్తితో శ్రీరామ నామ స్తోత్ర పారాయణాన్ని పాటించారు. ఈ సందర్భంగా స్కూల్‌లో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఫౌండర్ సీఈవో ఎ.మోహన వంశీ, ప్రిన్సిపాల్ మధుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ఏర్పాట్లు పూర్తి : ఈవో

అమీర్‌పేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట హనుమాన్ దేవాలయంలో కనులపండువగా జరుగనున్న శ్రీసీతారామ చంద్రస్వామి కల్యాణమహోత్సవాలకు సకల ఏర్పాట్లు చేసినట్లు కార్యనిర్వాహన అధికారి విఠలయ్య వెల్లడించారు. ఈవో కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను విఠలయ్య వెల్లడించారు. వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభమైన వారం రోజులకు జరిగే ఈ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ ప్రాంగాణాన్ని సర్వంగా సుందరంగా తీర్చిదిద్దామన్నారు. కల్యాణం తిలకించేందుకు వచ్చే భక్తులకు మంచినీటి సౌకర్యంతోపాటు సుమారు 2 వేల మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నమన్నారు. నేటి ఉదయం 10-35 గంటలకు జరుగనున్న కల్యాణమహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలని ఈవో కోరారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎర్రగడ్డ వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీనివాస్

మంచినీటి సమస్యల పరిష్కారానికి కృషి

ఎర్రగడ్డ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్లో మంచినీటి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తానని వాటర్ వర్క్స్ ఎర్రగడ్డ సబ్ డివిజన్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన అధికారులు, స్థానిక నాయకులతో కలిసి సుల్తాన్ నగర్‌లో పర్యటించారు. స్థానికంగా నూతన పైపులైను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నూతన పైపులైన్ సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారి వెంకటేష్, ఎంఐఎం పార్టీ నాయకులు మహ్మద్ అజర్, సయ్యద్ రసూల్, ఖయ్యూం, సుకర్, లతీఫ్, జాంగీర్, అష్రఫ్ అలీ, మొహమ్మద్ గఫర్ పాల్గొన్నారు.

● రివార్డుల అందజేత



మంచి పనితీరును ప్రదర్శించిన కమిషనరేట్‌లోని సైబర్‌క్రైం, ఉమెన్‌సేఫ్టీ అధికారులను మంగళవారం అభినందించి రివార్డులను అందించిన సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి - హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి)



వివరాలు వెల్లడిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని

ఫేమస్ కోసం దొంగవాహనాలతో స్టంట్లు

- సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు
- బేగంపేటలో ఇద్దరి అరెస్టు.. 9 ద్విచక్రవాహనాల స్వాధీనం

బేగంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఫేమస్ అవుదామని పలు రకాల వాహనాలను చోరీచేసి.. విన్యాసాలు చేసి.. వాటిని వీడియో తీసి.. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టింగులు పెట్టారు.. వీరి విన్యాసాల వాహనాలు దొంగవని గుర్తించిన పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు. వారి నుంచి 9 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టరు రామయ్య, డీఐ మల్లేష్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. చాంద్రాయణగుట్ట సమీపంలోని షాహీన్‌నగర్‌కు చెందిన షేక్ ఇబ్రహీం(19), బేగంపేట పాటిగడ్డకు చెందిన బాలుడు కలిసి నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పార్క్ చేసిన ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్నారు. దొంగిలించిన వాహనాల నంబర్ ప్లేట్లను తొలగించి షాహీన్‌నగర్‌లో, నగర శివారు ప్రాంతాల్లో స్టంట్లు నిర్వహించేవారు. వీరు చేసిన విన్యాసాలను వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేస్తుండేవారు. బేగంపేటలోని తన వాహనం చోరీకి గురైందని స్మితపటేల్ ఈనెల 13న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీలను విశ్లేషించగా చోరీకి గురయిన వాహనాలు షాహీన్‌నగర్‌లో నంబరు ప్లేట్లు లేకుండా తిరుగుతున్నాయని గుర్తించారు. దీంతో అడ్మిన్ ఎస్సై గంగాధర్ నేతృత్వంలో క్రైంపోలీసులు షాహీన్‌నగర్ వెళ్లి వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితులు షేక్‌ఇబ్రహీం, మరో బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సార్‌నగర్ పరిధిలో రెండుసార్లు, సనత్‌నగర్‌లో మూడుసార్లు హుమాయున్‌నగర్, రాంగోపాల్‌పేట, ఫిల్మ్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో ఒక్కొక్కసారి వాహనాల చోరీలకు పాల్పడినట్లు వీరు పోలీసుల విచారణలో వెల్లడించారు. నిందితుల నుంచి డియో వాహనాలు 7, జుపిటర్ 1, యమహా ఆర్‌ఎక్స్1ని స్వాధీనం చేసుకున్నారు.

పెళ్లిపేరుతో మహిళను మోసం చేసిన వ్యక్తి రిమాండ్

ఖైరతాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని మహిళను నమ్మించి మోసం చేసిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సైఫాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మలబస్తీ నివాసి కోమటి శ్రీనుబాబు(45)రియల్ ఎస్టేట్‌వ్యాపారి. స్థానికంగా ఓ హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న అవివాహిత(34)తో సంవత్సరం క్రితం శ్రీనుబాబుకు పరిచయం ఏర్పడింది. అదికాస్త ప్రేమగా మారి వివాహం చేసుకుంటానని నమ్మించి, పలుమార్లు హోటళ్లకు తీసుకెళ్లాడు. పెళ్లి చేసుకోమనడంతో బెదిరింపులకు పాల్పడుతున్నాడని మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై విచారించిన పోలీసులు నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

- నెల గడుస్తున్నా రిపోర్ట్ చేయని బదిలీపై వచ్చే అధికారులు
- సగం మంది ఎస్ఐలు, కానిస్టేబుళ్లతోనే విధుల నిర్వహణ
- బందోబస్తులతో స్టేషన్ ఉక్కిరిబిక్కిరి

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్
సగం సి(ఇ)బ్బందే..!



నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో పెద్ద రాణా అది.. ఇక్కడ ఏది జరిగినా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారుతుంది. ఓ వైపు వీఐపీల బందోబస్తు.. మరోవైపు కేసులను పరిష్కరించడం అధికారులకు కత్తిమీద సాము లాంటిదే. కానీ ఇప్పుడు ఈ రాణాను సిబ్బందిలేమి సమస్య వెంటాడుతోంది. బదిలీపై రావాల్సిన ఎస్ఐ స్థాయి అధికారులు రాకపోవడం.. సగం మందే కానిస్టేబుళ్లు ఉన్నారు. దీంతో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతోంది. వారంలో రెండుసార్లు రాత్రిపూట విధులు నిర్వహిస్తూ.. పనిఒత్తిడికి గురవుతున్న జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌పై ప్రత్యేక కథనం

బంజారాహిల్స్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ ఇది ఎప్పుడూ చర్చల్లోనే ఉంటోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ధనవంతులు, పారిశ్రామికవేత్తలతో పాటు పాశ్చాత్యసంస్కృతి అయిన పబ్‌లు ఇక్కడే అధికంగా ఉన్నాయి. దీంతో నిత్యం జూబ్లీహిల్స్ రాణాలో చోటుచేసుకునే నేరాలు రాష్ట్ర వ్యాప్తంగా అందరిదృష్టినీ ఆకర్షిస్తుంటాయి. పైగా ఇప్పుడు సీఎం నివాసానికి భద్రత కూడా జూబ్లీహిల్స్ రాణా సిబ్బందిదే. అయితే రెండు నెలలుగా సిబ్బంది కొరత రాణాను వెంటాడుతోంది. దీంతో ఉన్న వారిపై పనిఒత్తిడి పెరిగిపోతోంది. కొన్నిసందర్భాల్లో అధికారులు, సిబ్బంది బందోబస్తు కోసం బయటకు వెళ్లిపోవడంతో ఫిర్యాదుదారులు గంటల కొద్దీ వేచి చూడాల్సిన సందర్భాలు కూడా లేకపోలేదు.

ఉన్నది సగం సిబ్బందే..

జూబ్లీహిల్స్ రాణా ఆవిర్భవించిన తరువాత కేసుల సంఖ్య పెరుగుతుండటంతో పది మంది ఎస్ఐలను అప్పటి కమిషనర్ అలాట్ చేశాడు. రాణాలో ఉన్న పరిధులను 8 సెక్టార్లుగా విభజించి, వీటి బాధ్యతను ఒక్కో ఎస్ఐకు కేటాయించేవారు. మిగతా ఇద్దరిలో ఒకరు అడ్మిన్ ఎస్ఐగా మరకొరు క్రైమ్‌లో పనిచేయాల్సి ఉంటుంది. అయితే పాత ఎస్ఐలను బదిలీ చేసిన వెంటనే కొత్తవారిని ఇక్కడ నియమించడం, వారు వెంటనే చార్జ్ తీసుకోవడంతో ఇబ్బంది ఉండేది కాదు. కానీ ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయి. రెండు నెల క్రితం బదిలీల్లో ఇక్కడ పనిచేసే ఎస్ఐలకు స్థానచలనం జరిగింది. వీరిస్థానంలో ఐదుగురు కొత్త ఎస్ఐలను జూబ్లీహిల్స్ రాణాకు కేటాయించారు.

పెరుగుతోన్న పనిభారం

కొత్త అధికారులు రాకపోవడంతో పనిభారమంతా ఉన్న ఐదుగురిపైనే పడుతోంది. కొత్త అధికారులు హరీశ్వర్‌రెడ్డి రిపోర్ట్ చేసినప్పటికీ ఫోన్ ట్యాపింగ్ కేసు కోసం ఏర్పడ్డ సిట్‌లో ఉన్నారు. దీంతో ఆయన రాణాకు రారు. ఇక మిగిలిన నలుగురిలో ఓ అధికారి సిక్ చేసి ఇంటికే పరిమితమయ్యారు. మిగతా ముగ్గురు ఇప్పటి వరకు రిపోర్ట్ చేయలేదు. దీంతో ఎనిమిది సెక్టార్ల పనిని ఐదుగురే నిర్వర్తిస్తున్నారు. కానిస్టేబుళ్ల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. రాణాలో 180 మంది కానిస్టేబుళ్లు ఉండాలి. కానీ 90 మంది మాత్రమే ఉన్నారు. షిఫ్టులవారీగా విధుల్లో ఉండే వారి సంఖ్య ఇంకా తగ్గిపోతోంది. దీన్నివల్ల కొన్నిపనులు పెండింగ్‌లో పడుతున్నాయని అధికారులే చెబుతున్నారు. ఉన్నతాధికారులు కలుగు చేసుకొని సమస్యను పరిష్కరిస్తే ఫిర్యాదుదారులకు మేలు జరుగుతుందని కోరుతున్నారు.

ఔట్‌సోర్సింగ్ వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలి
- టీఎంఆర్ఈఐ నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్

పంజాగుట్ట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి నేరుగా ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ మైనారిటీ అవుట్ సోర్సింగ్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసింది. అసోసియేషన్ ఆవిర్భావం సందర్భంగా మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడు మహ్మద్ రాజమ్మద్, ప్రధానకార్యదర్శి రేష్మ, ఉపాధ్యక్షుడు ఎండీ రఫీ, తదితరులు మాట్లాడారు. 2016 నుంచి మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నామని, అపాయింట్‌మెంట్ సమయంలో అవుట్ సోర్సింగ్ అని చెప్పి, ప్రస్తుతం డైలీ హెల్పేర్స్‌గా పరిగణిస్తున్నారన్నారు. ఒక్క రోజు కూడా సెలవు లేకుండా విద్యార్థులకు సేవ చేస్తున్నామని, అయినా తమకు తగిన గుర్తింపు, కష్టానికి తగిన ఫలితం లేదన్నారు. 11 నెలల జీతం మాత్రమే వస్తోందని, 45 రోజుల వేతనాన్ని నిలిపివేస్తున్నారన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించి తమను ఆదుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 269 మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 4 వేలకు పైగా నాన్ టీచింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్‌తో పాటు సెక్యూరిటీ, హౌస్ కీపింగ్, కుకింగ్ స్టాఫ్ విభాగాలలో పనిచేస్తున్న తమ పట్ల తీవ్రవివక్ష ప్రదర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మూడు విభాగాలకు చెందిన సిబ్బందికి పీఆర్సీ చెల్లించిన ప్రభుత్వం తమను విస్మరించిందని వాపోయారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు నజీర్, షాహీంసుల్తానా,అబ్దుల్ షఫీ, సతీష్, అబ్దుల్ లతీఫ్, సయ్యద్ అంజుం, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న టీఎంఆర్ఈఐ అవుట్ సోర్సింగ్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు



చింతలబస్తీలో ప్రచారం నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఖైరతాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నో సాహసోపేత నిర్ణయాలను తీసుకున్నారని, ప్రజలు ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి కిషన్‌రెడ్డి చింతలబస్తీ, రెడ్‌హిల్స్‌లలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా దేశం ముందుకు వెళ్లాలంటే మరోసారి మోదీ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. ఇందులో నాయకులు క్రాంతి, గౌతంరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యం : చింతల



బీజేపీ కరపత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మహాజన్ సంపర్క్‌లో భాగంగా మంగళవారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పనుల గురించి వివరించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ దేశాన్నిఅన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీజేపీకి దక్కుతోందన్నారు. మోదీ పాలనతో భారత్ ప్రపంచ దేశాలను సైతం ఆకట్టుకుంటోందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదని రెండు ప్రభుత్వాలు కలిసి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చాయని ఆరోపించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో అన్నిసీట్లలో బీజేపీ విజయం సాధించి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోజిరెడ్డి తదితరులు పాలొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఎన్నికల సందర్భంగా జూబ్లీహిల్స్ పోలీసులు మంగళవారం ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్ఐలు మెహర్ రాకేష్, గోపి ఇతర పోలీసులు ఇందులో పాల్గొన్నారు. కేంద్ర బలగాలు కూడా గాయత్రిహిల్స్ ఇతర ప్రాంతాల్లో పర్యటించారు. - బంజారాహిల్స్

● కాంగ్రెస్‌లో చేరిక



రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకుడు పీఆర్ఓ ప్రసాద్ - యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి)



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీలు వెంకట్‌రమణ, మోహన్‌కుమార్

వ్యాధులు నయం చేస్తామని మోసం
ఆయుర్వేద ఔషధాల ముఠా అరెస్ట్

అమీర్‌పేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి నయం చేస్తామని వారితో మాట కలిపి ముగ్గులోకి దింపి మోసాలకు పాల్పడుతున్న కర్నాటక, నాగ్‌పూర్‌కు చెందిన నకిలీ ఆయుర్వేద ఔషధాల ముఠా సభ్యులు ముగ్గురిని మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఎస్ఆర్‌నగర్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వెంకటరమణ, పంజాగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ వివరాలు వెల్లడించారు. కేన్సర్, పక్షవాతం, చర్మ వ్యాధులు, కిడ్నీ, అల్జీమర్, న్యూరో, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారిని ముఠా సభ్యులు గుర్తించి, గాలం వేస్తారు. తమ ఇంట్లో సభ్యులకు కూడా ఈ తరహా సమస్య ఉండేదని, ఆయుర్వేద ఔషధం వాడడంతో తగ్గిపోయిందని నమ్మిస్తారు. మందు కోసం తమకు తెలిసిన వైద్యుడిని సంప్రదించాలని ముఠాలోని మరో సభ్యుడి ఫోన్ నెంబర్ ఇస్తారు. తరువాత వైద్యులుగా చెప్పుకునే ముఠా సభ్యులు బాధితుల ఇళ్లకు వెళ్లి కొబ్బరి నూనె, ఆవనూనె, కర్పూరం, యాలకులు, పసుపుతో చికిత్స మార్గాలను సూచిస్తారు. చికిత్సకు వాడే వస్తువులు తమకు తెలిసిన ఆయుర్వేద స్టోర్లలో మాత్రమే దొరుకుతాయని చెబుతారు. బాధితులకు నకిలీ ఆయుర్వేద మందుల దుకాణాల వివరాలు చెబుతారు. ఇంటికి వచ్చి చికిత్స చేసేందుకు, ఆయుర్వేద దుకాణాల్లో మందులు కొనుగోలు చేసేందుకు లక్షల్లో డబ్బు వసూలు చేస్తారు. నిందితులు మధురానగర్‌లో 3, నారాయణగూడలో 2, బేగంపేటలో 2, ఫిల్మ్‌నగర్, కూకట్‌పల్లి, గోల్కొండ, ఎస్ఆర్‌నగర్, మారేడ్‌పల్లి, బోరబండ, పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున మోసాలకు పాల్పడ్డారు. బాధితుల నుంచి రూ.19 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం.

కొత్త ఎత్తుగడతో సైబర్ మోసాలు

- అరెస్టు వారెంట్ వచ్చిందంటూ రూ.60వేలు
- ఇన్సూరెన్స్ పేరుతో రూ.50వేలు కాజేత

నగరంలో సైబర్ మోసాల్లో రోజురోజుకు కొత్తకోణాలు వెలుగు చూస్తున్నాయి. అరెస్టు వారెంట్ వచ్చిదంటూ సైబర్ నేరగాళ్లు ఓ మహిళను బురిడీ కొట్టించి రూ.60 వేలను కాజేయగా.. మరో ఘటనలో ఇన్సూరెన్స్ పేరుతో మరో మహిళ ఖాతాలోని రూ.50వేలను కాజేశాడు. వివరాలిలా ఉన్నాయి.

బంజారాహిల్స్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్‌రోడ్డు నంబరు 12 పార్చూన్ ఎన్‌క్లేవ్‌లో నివసించే చెన్నుపాటి సౌజన్య గృహిణి. ఈనెల 15న ఆమెకు ఫోన్ వచ్చింది. ఎదుటి వ్యక్తి వాట్సాప్ ద్వారా వీడియో కాల్‌కు కనెక్ట్ అయి అరెస్టు వారెం ట్ వచ్చిదంటూ ఓ కాపీను షేర్ చేశారు. దీన్ని నుంచి తప్పించుకోవాలంటే తాము పంపించే లిం కు ద్వారా రూ.60వేలు చెల్లించాలని చెప్పాడు. ఆం దోళనకు గురైన సౌజన్య వారు చెప్పినట్టు డబ్బు పంపించింది. ఆ తర్వాత అనుమానం వచ్చి ఫోన్ చేయగా అది పనిచేయలేదు. మోసపోయినట్టు గ్రహించిన ఆమె బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హెల్త్ ఇన్సూరెన్స్ పేరుతో రూ.50వేలు..

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): హెల్త్ ఇన్సూరెన్స్ పేరుతో ఓ మహిళ బ్యాంక్ ఖాతా నుంచి రూ.50వేలు కాజేశాడో మోసగాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఖమ్మంజిల్లా తల్లాడ మండలం బసవాపురం గ్రామానికి చెందిన కర్నాటి సరస్వతి మధురానగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తోంది. ఈనెల 6న సాయంత్రం ఓ ఫోన్ వచ్చింది. ఐసీఐసీఐ హెల్త్ ఇన్సూరెన్స్ నుంచి చేస్తున్నామని, వివరాలతో కూడిన లింక్ వాట్సాప్‌నకు పంపుతామని, దాన్ని ఓపెన్‌చేయాలని చెప్పాడు. లింక్ ఓపెన్ చేయగానే వెంటవెంటనే రూ.10వేల చొప్పున ఐదుసార్లు నగదు బదిలీ జరిగింది. ఆ తర్వాత రూ.2 బదిలీ అయినట్లు మెసేజ్ వచ్చింది. మొత్తం రూ.50,002 తన అకౌంట్ నుంచి విత్‌డ్రా అయ్యాయి. దీంతో సరస్వతి సైబర్‌క్రైమ్, మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.


ఓటు కోసం ఖైరతాబాద్‌లో 5,399 మంది దరఖాస్తులు



బీఎల్‌వో సూపర్‌వైజర్లు, సెక్టార్ అధికారులకు జరిగిన సమావేశంలో పాల్గొన్న సికింద్రాబాద్ ఆర్‌వో హేమంత్, అధికారులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కొత్త ఓటర్లుగా నమోదుకు, చిరునామా మార్పిడికి ఇచ్చిన గడువు మంగళవారంతో ముగిసింది. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో జనవరి 23వ తేదీ నుంచి ఏప్రిల్ 15 వరకు కొత్త ఓటరుగా నమోదయ్యేందుకు 5,399 మంది ఫారం నెంబర్ 6ను సమర్పించారు. చిరునామా మార్పిడి, ఓటు బదిలీల కోసం 6,258 మంది ఫారం నెంబర్ 8లను అందజేశారు. ఈ దరఖాస్తులన్నింటినీ వెంటనే పరిశీలించి, వారం రోజుల్లో తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని ఖైరతాబాద్ నియోజకవర్గ ఈఆర్‌ఓ, జూబ్లీహిల్స్ ఉప కమిషనర్ ప్రశాంతి తెలిపారు. ఎన్నికల్లో పనిచేయనున్న బీఎల్‌ఓ సూపర్‌వైజర్లకు, సెక్టార్ అధికారులకు మంగళవారం హరిహర కళాభవన్‌లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హేమంత కేశవ్ పాటిల్‌తో పాటు పలువురు అధికారులు శిక్షణ ఇచ్చారు.

హెరిటేజ్‌సిటీగా నామినేట్‌కు కృషి



విద్యార్థులకు హైదరాబాద్ చరిత్రపై అవగాహన కల్పిస్తున్న చరిత్రకారులు, ఆర్కిటెక్ట్‌లు

బంజారాహిల్స్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్ నగరాన్ని ఈ ఏడాది యునెస్కో నిర్వహించే హెరిటేజ్ సదస్సులో హెరిటేజ్ సిటీగా నామినేట్ చేసేందుకు తాము కృషి చేస్తున్నట్లు చరిత్రకారిణి, కన్జర్వేషన్ ఆర్కిటెక్ట్, అర్బన్‌ప్లానర్ వసంత శోభ తెలిపారు. వచ్చేనెల మొదటి వారంలో వరల్డ్ హెరిటేజ్ డే సందర్భంగా బంజారాహిల్స్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్ ఆధ్వర్యంలో ప్రత్యేక హెరిటేజ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కళాశాల ఆవరణలో మంగళవారం విద్యార్థులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వందల ఏళ్ల క్రితం నాటి చిత్రాలతోపాటు మ్యాప్‌లు, హెరిటేజ్ కట్టడాల చిత్రాలు, తదితర వివరాలను ఆర్కిటెక్ట్ విద్యార్థులతో డిజిటలైజ్ చేయించి ఆ నమూనాలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 400 ఏళ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్ నగరంలో ఎంతో చారిత్రక సంపద ఉన్నదని, వాటిని కాపాడటంతోపాటు భావితరాలకు తెలియజేయాలనే గొప్ప ఉద్దేశంతో ఈ ఎగ్జిబిషన్ నిర్వహించబోతున్నట్లు ఆమె తెలిపారు. ఈ ఏడాది యునెస్కో నిర్వహించబోయే వరల్డ్ హెరిటేజ్ సదస్సుకు తొలిసారిగా మన దేశం ఢిల్లీ వేదికగా ఆతిథ్యం ఇవ్వబోతున్నదన్నారు. అందువల్ల హైదరాబాద్‌కు మరింత ఖ్యాతి వచ్చేలా యునెస్కో గుర్తింపుకు నామినేట్ అయ్యేందుకు తాము కృషి చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆర్కిటెక్ట్ విద్యార్థులకు నగర చరిత్రను తెలిపే పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జేఎన్ఐఏఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ డి.సురేష్, జేఎన్ఐఏఎస్ ప్రిన్సిపాల్ శాలిని కాకాని, జర్నలిస్ట్ అయాన్‌అలీ, ఆసిఫ్ అలీఖాన్, శశాంక్, రాహుల్, నాగరాజు రావిడి, ఇందిర కొల్లి పాల్గొన్నారు.



కార్డినల్ పూల ఆంథోనితో సునీతామహేందర్‌రెడ్డి, శ్రీగణేష్, మైనంపల్లి హన్మంతరావు

కార్డినల్ పూల ఆంథోనీని కలిసిన కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్ రెడ్డి, కంటోన్మెంట్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేష్‌లు మల్కాజ్‌గిరి పార్లమెంట్‌రీ ఇన్‌చార్జి మైనంపల్లి హనుమంతరావుతో కలిసి హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ ఆర్చ్ బిషప్ కార్డినల్ పూల ఆంథోనీని బిషప్ హౌజ్‌లో కలిసి ఎన్నికలలో మద్దతు కోరి ఆశీర్వాదం తీసుకున్నారు.

షార్ట్‌సర్క్యూట్ బాధితులకు కార్పొరేటర్ పరామర్శ

బౌద్ధనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మహ్మద్‌గూడలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా నష్టపోయిన కుటుంబాన్ని మంగళవారం సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ పరామర్శించారు. స్థానికంగా నివశిస్తున్న తబుస్సుమ్ ఇంటిలో షార్ట్‌సర్క్యూట్ అయి సామాన్లు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ బాధితురాలిని పరామర్శించి రేషన్, ఇతరసామగ్రిని ఇప్పించారు. విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్ పునరుద్ధరణ అయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.



ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్న పద్మారావుగౌడ్

అభివృద్ధి ప్రజలకు చేరేలా ప్రచారం

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు చేరేలా ప్రచారం ఉంటుందని సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని ఆయన నివాసంలో ఎన్నికల ప్రచార వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు చేరేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



చలివేంద్రం ప్రారంభంలో సీఐ అనుదీప తదితరులు

చలివేంద్రం ఏర్పాటు

చిలకలగూడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ, శ్రీదేవి థియేటర్ వద్ద బీజేపీ నాయకుడు మేకల చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చిలకలగూడ సీఐ మంగళవారం లాంఛనంగా ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ బాటసారుల దాహార్తి తీర్చటానికి చలివేంద్రాలు దోహదం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యం.హనుమంతరావు, మురళి, సంపత్, నందు అజయ్ తదితరులు పాల్గొన్నారు.



వందేళ్ల చరిత్ర కలిగిన సికింద్రాబాద్ తుకారాంగేట్‌లోని పహాడి ఆలయంలో కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటపల్లి రమణారెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు లల్లుభాయ్, మేకల లక్ష్మణ్ పాల్గొన్నారు.

- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి



అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కల్పిస్తున్న సికింద్రాబాద్ ఫైర్ ఆఫీసర్ మోహన్‌రావు

అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు అరికట్టడానికి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సికింద్రాబాద్ ఫైర్ ఆఫీసర్ మోహన్ రావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదం సంభవించినపుడు తీసుకోవాలసిన జాగ్రత్తలపై ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు బాధితులను కాపాడటం, మంటలు ఆర్పే విధానంను ప్రత్యక్షంగా చూపించారు. ఆస్పత్రిలో ఉన్న ఫైర్ సేఫ్టీ వ్యవస్థను తనిఖీ చేశారు. అగ్ని ప్రమాదాల నివారణ, జాగ్రత్తలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

శ్రీరామనవమికి భారీ బందోబస్తు

● **ఏసీపీ జైపాల్‌రెడ్డి**



బౌద్ధనగర్ ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని బుధవారం చిలకలగూడ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ బందోబస్తును ఏర్పాటు చేశామని ఏసీపీ జైపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ చిలకలగూడ, వారాసిగూడ, లాలాగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 31 దేవాలయాల్లో సీతారామ చంద్రస్వామి కల్యాణాలు జరుగుతున్నాయని, 14 శోభాయాత్రలకు అనుమతి ఇచ్చామని తెలిపారు. చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయం వద్ద భారీ శోభాయాత్ర జరుగుతుందని, దీంతో పాటు నేరేడ్‌మెట్ నుంచి అతిపెద్ద శోభాయాత్ర మల్కాజగిరి మీదుగా లాలాగూడ పోచమ్మ ఆలయం వరకు జరుగుతుందని, ఇందులో సుమారు నాలుగువేల మంది భక్తులు పాల్గొనే అవకాశముందని తెలిపారు. ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో ముఖ్యకూడళ్లతోపాటు ఆలయాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశామని తెలిపారు. రెండు ప్లాటూన్‌లతో పాటు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది బందోబస్తును నిర్వహిస్తారని తెలిపారు. శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని కోరారు.



శ్రీరామనవమి సందర్భంగా భారీ ఏర్పాట్లు చేస్తున్న పహాడి హనుమాన్ దేవదాయ అభివృద్ధి కమిటీ

శ్రీరామ నవమి ఉత్సవాలకు సకల ఏర్పాట్లు

● **ఈవో విఠలయ్య**



అమీర్‌పేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట హనుమాన్ దేవాలయంలో కనుల పండువగా జరుగనున్న సీతారామ చంద్రస్వామి కల్యాణమహోత్సవాలకు సకల ఏర్పాట్లు చేసినట్లు కార్యనిర్వహణాధికారి విఠలయ్య వెల్లడించారు. ఈవో కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను విఠలయ్య వెల్లడించారు. వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభమైన వారం రోజులకు జరిగే ఈ కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దామన్నారు. కల్యాణం తిలకించేందుకు వచ్చే భక్తులకు మంచినీటి సౌకర్యంతోపాటు సుమారు 2వేల మందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. నేటి ఉదయం 10-35 నిమిషాలకు జరుగనున్న కల్యాణమహోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలని ఈవో కోరారు.

సీతారాముల కల్యాణానికి ముస్తాబైన వీర హనుమాన్ మూలమూర్తి



రాంగోపాల్‌పేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలకు సికింద్రాబాద్ ఎస్పీరోడ్డులోని వీరహనుమాన్ దేవాలయం ముస్తాబు అయ్యింది. రాములోరి కల్యాణాన్ని వీక్షించడానికి ఆలయంలో చేపట్టిన ఏర్పాట్ల గురించి ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసశర్మ వెల్లడించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లను చేపట్టామన్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారామ కల్యాణ వైభవాన్ని భక్తులు సామూహికంగా తిలకించి తరించడానికి చలువ పందిళ్ళు ఏర్పాటు చేయడం జరిగిందని, వేసవిని దృష్టిలో పెట్టుకొని కూలర్లను, మంచినీటి వసతులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. బుధవారం రామాయణ అంతర గ్రహిత సుందరకాండ పారాయణము, షోడషోపచార పూజలు, ఉదయం 10.30 గంటలకు సీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నామన్నారు. భక్తులకు పానకం, వడపప్పు, ప్రసాదాల పంపిణీతో పాటు అన్నప్రసాద వితరణ ఉంటుందని వివరించారు.

సికింద్రాబాద్-దానాపూర్ మధ్య 24 ప్రత్యేక రైళ్లు

● **దక్షిణ మధ్య రైల్వే**

హైదరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవి ప్రయాణికుల రద్దీని పరిగణలోకి తీసుకుని సికింద్రాబాద్-దానాపూర్ మధ్య 24 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్, మే, జూన్ చివరి వరకు ఈ ప్రత్యేక రైలు ప్రతి గురువారం సికింద్రాబాద్ నుంచి బయలుదేరుతుందని, అలాగే ప్రతి శనివారం దానాపూర్ నుంచి బయలుదేరుతుందని అధికారులు పేర్కొన్నారు. తెలంగాణ నుంచి ఉత్తరప్రదేశ్-బిహార్ రాష్ట్రాలకు వెళ్లి వచ్చే ప్రయాణికుల కోసం వారానికోసారి అన్‌రిజర్వ్‌డ్ కోచ్‌లతో ఈ రైలును నడపనున్నట్లు తెలిపారు. అదే విధంగా కాచిగూడ-కోచువెలి(07229) ఏప్రిల్ 18, 25 తేదీల్లో రెండుప్రత్యేక రైళ్లు, కోచువెలి-కాచిగూడ(07230) ఏప్రిల్ 19, 26 తేదీల్లో మరో రెండు ప్రత్యేక రైళ్లు, సికింద్రాబాద్-సంత్రాగచి(07221) ఏప్రిల్ 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి మంగళ, శనివారం 21ప్రత్యేక రైళ్లు, సంత్రాగచి-సికింద్రాబాద్ (07222) ఏప్రిల్ 21నుంచి జూన్ 30 వరకు ప్రతి బుధ,ఆదివారం 21ప్రత్యేక రైళ్లు ఉంటాయి. ప్రయాగరాజ్-ఎస్ఎంవీటీబెంగుళూరు (04131) ఏప్రిల్ 21 నుంచి జూన్30 వరకు ప్రతిఆదివారం, ఎస్ఎంవీటీబెంగుళూరు-ప్రయాగరాజ్ (04132)ఏప్రిల్24 నుంచి జులై 3 వరకు ప్రతి బుధవారం, ఎస్ఎంవీటీ బెంగుళూరు-గౌహతి (06521)ఏప్రిల్ 16 నుంచి జూన్ 25 వరకు ప్రతి మంగళవారం, గౌహతి- ఎస్ఎంవీటీబెంగుళూరు-(06522) ఏప్రిల్ 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం, ఎస్ఎంవీటీ బెంగుళూరు-మాల్దాటౌన్ (06565) ఏప్రిల్17 నుంచి జూన్ 26 వరకు ప్రతి బుధవారం, మాల్దాటౌన్-ఎస్ఎంవీటి బెంగుళూరు-(06565) ఏప్రిల్ 20 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం, హౌరా-యశ్వంత్‌పూర్ (02863) ఏప్రిల్18 నుంచి జూన్27 వరకు, యశ్వంత్‌పూర్-హౌరా (02864) ఏప్రిల్20 నుంచి జూన్ 29 వరకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీలు వెంకట్‌రమణ, మోహన్‌కుమార్

వ్యాధులు నయం చేస్తామని మోసం
ఆయుర్వేద ఔషధాల ముఠా అరెస్ట్

అమీర్‌పేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి నయం చేస్తామని వారితో మాట కలిపి ముగ్గులోకి దింపి మోసాలకు పాల్పడుతున్న కర్నాటక, నాగ్‌పూర్‌కు చెందిన నకిలీ ఆయుర్వేద ఔషధాల ముఠా సభ్యులు ముగ్గురిని మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం ఎస్ఆర్‌నగర్ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వెంకటరమణ, పంజాగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ వివరాలు వెల్లడించారు. కేన్సర్, పక్షవాతం, చర్మవ్యాధులు, కిడ్నీ, అల్జీమర్, న్యూరో, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారిని ముఠా సభ్యులు గుర్తించి, గాలం వేస్తారు. తమ ఇంట్లో సభ్యులకు కూడా ఈ తరహా సమస్య ఉండేదని, ఆయుర్వేద ఔషధం వాడడంతో తగ్గిపోయిందని నమ్మిస్తారు. మందు కోసం తమకు తెలిసిన వైద్యుడిని సంప్రదించాలని ముఠాలోని మరో సభ్యుడి ఫోన్ నెంబర్ ఇస్తారు. తరువాత వైద్యులుగా చెప్పుకునే ముఠా సభ్యులు బాధితుల ఇళ్లకు వెళ్లి కొబ్బరి నూనె, ఆవనూనె, కర్పూరం, యాలకులు, పసుపుతో చికిత్స మార్గాలను సూచిస్తారు. చికిత్సకు వాడే వస్తువులు తమకు తెలిసిన ఆయుర్వేద స్టోర్లలో మాత్రమే దొరుకుతాయని చెబుతారు. బాధితులకు నకిలీ ఆయుర్వేద మందుల దుకాణాల వివరాలు చెబుతారు. ఇంటికి వచ్చి చికిత్స చేసేందుకు, ఆయుర్వేద దుకాణాల్లో మందులు కొనుగోలు చేసేందుకు లక్షల్లో డబ్బు వసూలు చేస్తారు. నిందితులు మధురానగర్‌లో 3, నారాయణగూడలో 2, బేగంపేటలో 2, ఫిల్మ్‌నగర్, కూకట్‌పల్లి, గోల్కొండ, ఎస్ఆర్‌నగర్, మారేడ్‌పల్లి, బోరబండ, పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున మోసాలకు పాల్పడ్డారు. బాధితుల నుంచి రూ.19 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం.



సీతాఫల్‌మండి బీదలబస్తీలో మంగళవారం వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్ఎల్ఎఫ్, ఎస్‌హెచ్‌జీ మహిళలు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న బీదలబస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నందారం సీతారాంమాదిగ, ఆర్‌పీ లక్ష్మి తదితరులు.

- బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి



టెక్నోస్మానియా 2024 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ప్రొ.చింతసాయిలు తదితరులు

రేపటి నుంచి ఓయూ టెక్నాలజీ కాలేజీలో టెక్నోస్మానియా 2024

తార్నాక, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో ఈనెల 18 నుంచి మూడు రోజులపాటు జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ టెక్నోస్మానియా 2024 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొ.చింతసాయిలు అన్నారు. ఈమేరకు మంగళవారం ఓయూలోని టెక్నాలజీ కాలేజీలో కళాశాల యాజమాన్యం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొ.చింతసాయిలు మాట్లాడుతూ ఈనెల 18, 19, 20 మూడు రోజులపాటు నిర్వహించే జాతీయ టెక్నో ఫెస్ట్‌లో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొగ్రాం కన్వీనర్ ప్రొ.ఎస్.శ్రీనునాయక్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ.వి.రమేష్ కుమార్, ప్రొ.వి.వి.బసవరావు, ప్రొ.ప్రభాకర్ రెడ్డి, ప్రొ.బి.రాజం, ఫ్యాకల్టీ కో- ఆర్డినేటర్ డా.ఏ.పరశురాములు, డా.పరమేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ టి.ఎన్ వంశతిలక్

కంటోన్మెంట్ ప్రజల వాణిని అసెంబ్లీలో వినిపిస్తా

● **డాక్టర్ టి.ఎన్.వంశ తిలక్**

సికింద్రాబాద్, బోయినపల్లి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గ ఉపఎన్నికల్లో తనను గెలిపిస్తే అన్నివర్గాల ప్రజల వాణిని అసెంబ్లీలో వినిపిస్తానని బీజేపీ అభ్యర్థి టి.ఎన్.వంశతిలక్ చెప్పారు. కంటోన్మెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా మంగళవారం తిలక్ పేరు ప్రకటించింది. దీంతో ఆయన బోవనపల్లిలో బీజేపీ నాయకులు బాణుక మల్లికార్జున్. బి.ఎన్.శ్రీనివాస్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. తనది రాజకీయ కుటుంబ నేపథ్యమని, తన తల్లి టిఎన్ సదాలక్ష్మి కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని బొల్లారం ప్రాంతానికి చెందిన వారని అన్నారు. సదాలక్ష్మి 1957లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎస్సీ రిజర్వుడు స్థానం కామారెడ్డి నుంచి శాసనసభకు ఎన్నికయ్యారని చెప్పారు.

1960లో డిప్యూటి స్పీకర్‌గా, 1962లో ఉమ్మడి రాష్ట్రంలో తొలి మహిళా మంత్రిగా పనిచేశారని చెప్పారు. 1969లో తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. 1982లో టీడీపీలో చేరారని చెప్పారు. తన తండ్రి పద్మశ్రీ టి.వి.నారాయణ, ఎపీపీఎస్సీ సభ్యుడుగా, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యునిగా కొనసాగారని తెలిపారు. తాను ప్రస్తుతం ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా, బీజేపీ పార్టీకి సేవలందిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర రక్షణ శాఖ ఆధీనంలోని కంటోన్మెంట్ అభివృద్ధికి, కంటోన్మెంట్‌ను పట్టి పీడిస్తున్న మంచినీటి సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని తిలక్ పేర్కొన్నారు.

ఊసరవెల్లి శ్రీగణేష్‌కు గుణపాఠం తప్పదు

బాణుక మల్లికార్జున్ పూటకో పార్టీ మార్చే ఎన్.శ్రీగణేష్ తాజా ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో ఉన్నారని, ఊసరవెల్లిలా పార్టీలు మారుతున్న గణేష్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, బీజేపీ ఓబీసీ సెల్ నేత బాణుక మల్లికార్జున్ అన్నారు. ఎన్నికల ప్రచారానికి వెళుతున్న గణేష్ ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. కాగా బీఆర్ఎస్ అభ్యర్థి నివేదితపై వస్తున్న అవినీతి ఆరోపణలు ప్రస్తుతం కంటోన్మెంట్ వ్యాప్తంగా చర్చనీయాంశంగా ఉన్నాయని, అందుకే ప్రజలు బీజేపీని గెలిపించాలని నిర్ణయించుకున్నారని అన్నారు.

సికింద్రాబాద్‌లో ఇంటర్ విద్యార్థి అదృశ్యం



ఆరిఫ్ అహ్మద్‌ఖాన్

అడ్డగుట్ట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తల్లిని చూసి తిరిగి చిన్నమ్మ ఇంటికి వస్తున్న ఓ ఇంటర్ విద్యార్థి సికింద్రాబాద్‌లో అదృశ్యమైన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం టీవీ కాలనీలో ఉంటున్న చిన్నమ్మ జకీరాబేగం ఇంట్లో ఉంటున్న ఆరిఫ్ అహ్మద్‌ఖాన్(16) డాక్టర్ అకాడమీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువు పూర్తిచేశాడు. సెలవులు రావడంతో నెల రోజుల క్రితం తాండూర్‌లో ఉన్న తల్లిని చూసేందుకు వెళ్లి తిరిగి సోమవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో బస్సు దిగి, దారినపోయో వ్యక్తి నుంచి ఫోన్ తీసుకుని తన తండ్రికి ఫోన్ చేసి తాను సికింద్రాబాద్‌లో బస్సు దిగానని సమాచారం ఇచ్చాడు. సాయంత్రం వరకు వనస్థలిపురంలో ఉంటున్న చిన్నమ్మ ఇంటికి చేరకపోవడంతో అనుమానం వచ్చి చిన్నమ్మ జకీరాబేగం వెంటనే విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఆరిఫ్ ఇంకా ఇంటికి రాలేదని సమాచారం ఇచ్చింది. సికింద్రాబాద్‌లోనే అదృశ్యమయ్యాడని చిన్నమ్మ జకీరా బేగం సాయంత్రం నార్త్‌జోన్ గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించగా, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఎదురుగా స్వాతి టిఫిన్ సెంటర్ వద్ద నిలబడి ఉన్నట్లుగా, అక్కడి నుంచి కనిపించకుండాపోయినట్లుగా సీసీ ఫుటేజీల ద్వారా పోలీసులు గుర్తించారు. విద్యార్థి ఎక్కడికి వెళ్లాడు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అయితే బాలుడు దారినపోయో వ్యక్తి ఫోన్ నుంచి చేసిన నెంబరు తీసుకున్న పోలీసులు అతనికి ఫోన్ చేసి వివరాలు అడగగా, సికింద్రాబాద్‌లో బాబు తన తండ్రికి ఫోన్ చేస్తానంటే ఫోన్ ఇచ్చానని, ప్రస్తుతం తాను బెంగాల్‌కు వెళ్లేందుకు రైలులో ఉన్నానని గోపాలపురం పోలీసులకు సమాచారం ఇచ్చాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విద్యార్థి కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. ఈ విద్యార్థి ఆచూకీ తెలిస్తే వెంటనే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని

చోరీ చేసిన వాహనాలతో స్టంట్లు

● **సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు**

● **ఫేమస్ అవుదామని అరెస్టయ్యారు**


● **బేగంపేటలో ఇద్దరి అరెస్టు.. 9 ద్విచక్రవాహనాలు స్వాధీనం**

బేగంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వాహనాలతో విన్యాసాలు చేసి ఫేమస్ కావాలనుకున్నారు.. పలు రకాల వాహనాలతో విన్యాసాలు చేసి.. వాటిని వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టింగులు పెట్టారు... ఇంత వరకు బాగానే ఉంది. అయితే వీరు విన్యాసాలు చేసిన వాహనాలు చోరీ చేసినవని గుర్తించిన పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టి వారి వద్ద నుంచి 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని ఏసీపీ గోపాల కృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టరు రామయ్య, డీఐ మల్లేష్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. చాంద్రాయణగుట్ట సమీపంలోని షాహీన్‌నగర్‌కు చెందిన షేక్ ఇబ్రహీం (19), బేగంపేట పాటిగడ్డకు చెందిన బాలుడు కలిసి నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పార్క్ చేసిన ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్నారు. దొంగిలించిన వాహనాల నంబరు ప్లేట్లను తొలగించి షాహిన్‌నగర్‌లోని నగర శివారు ప్రాంతాల్లో స్టంట్లు నిర్వహించేవారు. వీరు చేసిన విన్యాసాలను వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ గ్రూపులతో పోస్టు చేస్తుండేవారు. బేగంపేటలోని తన వాహనాం చోరీకి గురైందని స్మిత పటేల్ ఈనెల 13న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీలను విశ్లేషించగా చోరీకి గురయిన వాహనాలు షాహిన్‌నగర్‌లో నంబరు ప్లేట్లు లేకుండా తిరుగుతున్నాయని గుర్తించారు. దీంతో అడ్మిన్ ఎస్సై గంగాధర్ నేతృత్వంలో క్రైం పోలీసులు షాహిన్‌నగర్ వెళ్లి వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితులు షేక్ ఇబ్రహీం, మరో బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. వాహనాలను చోరీచేసి వాటి మీద విన్యాసాలు చేస్తూ ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లో పోస్టులు పెట్టి తద్వారా ఫేమస్ కావాలనుకున్నామని వీరు పోలీసులకు తెలిపారు. ఎస్సార్‌నగర్ పరిధిలో రెండుసార్లు, సనత్‌నగర్‌లో 3సార్లు హుమాయున్‌నగర్, రాంగోపాల్‌పేట, ఫిల్మ్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కసారి వాహనాల చోరీలకు పాల్పడినట్లు వీరు పోలీసుల విచారణలో వెల్లడించారు. నిందితుల నుంచి డియో వాహనాలు 7, జుపిటర్ 1, యమహా ఆర్‌ఎక్స్ 1 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతా కరువే

● **మాజీ మంత్రి మల్లారెడ్డి**

సికింద్రాబాద్, బోయినపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఏర్పడిన నాటి నుంచి కరువు వచ్చేసిందని, కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దని మాజీ మంత్రి, మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు మల్లారెడ్డి అన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నిక నేపథ్యంలో మంగళవారం బోయినపల్లిలోని మల్లారెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్ (సనత్‌నగర్), మర్రి రాజశేఖర్‌రెడ్డి (మల్కాజగిరి), కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నివేదితలతోపాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి తనదైన శైలిలో మాట్లాడుతూ ఆరుగ్యారెంటీల పేరిట తెలంగాణ



బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో తలసాని, మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నివేదిత తదితరులు

రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందని, ఇప్పటివరకు ఒక్క పథకాన్ని కూడా అమలుచేయలేని అసమర్థత కాంగ్రెస్ పాలన అన్నారు. మే13న జరిగే ఎన్నికల్లో లోకసభ స్థానానికి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి, ఉప ఎన్నికల్లో నివేదితకు ఓటు వేసి భారీ మోజార్టీతో గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రజలకు సాయన్న చేసిన సేవలు అపారమని, సాయన్న కుమార్తె నివేదితను మనమంతా సొంత కుటుంబ సభ్యురాలిగా భావించి, గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మర్రి రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు పర్యాయపదంగా నిలిచారని, ఐదుసార్లు శాసనసభ్యునిగా విజయం సాధించి, అన్నివర్గాల ప్రజలతో మమేకమైన సాయన్నకు సొంత ఇల్లు కూడా లేదంటే ఆయన నిస్వార్థ సేవ ఏపాటిదో అర్థమవుతుందన్నారు. సాయన్న ఆశయాల సాధనకు రాజకీయరంగ ప్రవేశం చేసిన నివేదితను ప్రజలు ఆశీర్వదించాలని, ఏడాది కాలంలో తండ్రి, చెల్లిని కోల్పోయిన నివేదితకు ప్రతి ఒక్కరూ బాసటగా నిలవవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీసభ్యులు పాండుయాదవ్, నళిని కిరణ్, అనితాప్రభాకర్, లోకనాథం, బోయినపల్లి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ప్లాట్ల కొనుగోలు పేరుతో మోసం

● **ఇద్దరిని అరెస్ట్ చేసిన సీసీఎస్ పోలీసులు**

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ ప్లాట్లు కొనుగోలు చేసి తక్కువ సమయంలోనే ఎక్కువ లాభాలు గడించొచ్చని మోసానికి పాల్పడిన ఇద్దరిని సీసీఎస్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. శాండ్ స్టోన్ ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు మానికొరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఏరువ శ్రీలక్ష్మిలు సంగారెడ్డి అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలో స్ప్రింగ్ సిటీ ఫేజ్-1, ఫేజ్-2 పేరుతో వెంచర్లు విక్రయించారు. తమ వెంచర్లలో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని ప్రచారం చేసుకున్నారు. వీరి మాటలు నమ్మిన స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీలో అడ్మిన్ అధికారిగా పనిచేస్తున్న ఎం.వెంకటేశంతో పాటు పలువురు పెట్టుబడులు పెట్టారు. లాభాలు రాకపోగా పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి ఇవ్వకపోవడంతో వీరందరూ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న సీసీఎస్ పోలీసులు దర్యాప్తు జరిపి మోసం జరిగినట్లు గుర్తించారు. నిందితులు మానికొరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఏరువ శ్రీలక్ష్మిలను అరెస్ట్ చేశారు.